



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 9 సంచిక : 243 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ శుక్రవారం 8 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :243 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA FRI 8 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## హోర్ముజ్‌పై అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం

- త్వరలోనే తెరుచుకోనున్న జలసంధి
- ఒకట్రెండు రోజుల్లోనే హోర్ముజ్ విషయంలో పూర్తి ఒప్పందం కుదిరి, జలసంధి అందుబాటులోకి వచ్చే అవకాశం

- మిగతా2లో



## హోర్ముజ్ జలసంధి దాటిన 11భారత నౌకలు

- ఇంకా 13 నౌకలు అక్కడే..
- విదేశాంగ శాఖ ప్రకటన
- మిగిలిన నౌకల్ని కూడా ఇండియా రప్పించేందుకు ఇరాన్‌తో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడి

- మిగతా2లో

# రవాణా వ్యయం భారీగా తగ్గాలి




- పారిశ్రామిక పార్కులకు రోడ్, రైల్ కనెక్టివిటీ పెరగాలి
- స్వర్ణాంధ్ర విజన్ 10 సూత్రాలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- వివిధ అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించాలి, అప్పుడే ఎక్కువ అభివృద్ధి సాధించగలమన్న సీఎం

పెన్ పవర్ డెస్క్:
స్వర్ణాంధ్ర-2047 విజన్ 10 సూత్రాలపై కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్లకు సీఎం దిశానిర్దేశం చేశారు. లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించగలిగితే అప్పుడు మరింతగా అభివృద్ధి సాధించగలమని అభిప్రాయపడ్డారు. రైలు మార్గం ద్వారా ప్రతీ కిలోమీటరుకు రూ.1.83 వ్యయం అవుతుంటే రహదారి మార్గంలో జరిగే రవాణా పై రూ.3.40 ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. రవాణా వ్యయం గణనీయంగా తగ్గితేనే ఏపీకి గరిష్టంగా ప్రయోజనం కలుగుతుందని వెల్లడించారు. పారిశ్రామిక పార్కులకు - మిగతా2లో



## రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అకాల వర్షం

- మరో 2 రోజులపాటు పిడుగులతో కూడిన వానలు!
- పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్న రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ
- రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచన

- మిగతా2లో




## ఏ ఉగ్రస్థావరం సురక్షితం కాదు

- ఆపరేషన్ సిందూర్ ముగింపు కాదు ప్రారంభం
- ఆపరేషన్ సిందూర్‌తో ఆ సందేశమిచ్చామన్న సైన్యం
- ప్రజలు, భద్రత, సార్వభౌమత్వాన్ని భారత్ కాపాడుకోగలదని వ్యాఖ్య
- ఆపరేషన్ సిందూర్‌కు నేటితో ఏడాది పూర్తి అయిన వేళ త్రివిధ దళాల అధిపతుల సమావేశం

- మిగతా2లో

## త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు

### కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు



పెన్ పవర్ డెస్క్:
త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రెండు రోజుల కలెక్టర్ల సమీక్షలో భాగంగా మొదటి రోజైన గురువారం సీఎం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో రూ.64 వేల కోట్ల విలువైన 624 రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయన్నారు. వీటితో పాటు రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులు డీపీఆర్ దశలో ఉన్నాయన్నారు. ఎక్స్‌ప్రెస్, లోకల్ ట్రైన్స్ లాంటి ప్రాజెక్టులు వస్తాయని, నాలుగు లేన్లతో రైల్వే మార్గాల విస్తరణ జరగబోతోందని వెల్లడించారు

# పిఠాపురంలో జనసేనదే పైచేయి

ఆ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వర్మ తొలగింపు



**పెన్ పవర్ డెస్క్:** పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య తరచూ గొడవలు జరుగుతూనే ఉన్నాయి. పిఠాపురం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ నియోజకవర్గంలో నిర్వహించిన ప్రభుత్వ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడంతో పిఠాపురం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రశ్నించారు. దీంతో జనసేన, టీడీపీ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. జనసే, బీజేపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసిమెలిసిగా ఉండాలని సీఎం పదేపదే చెబుతున్నా కొన్ని చోట్ల అందుకు భిన్నంగా - మిగతా2లో

## కేరళ సీఎం సీటుకు హోరాహోరీ పోరు

- ఎమ్మెల్యేలతో ఏఐసీసీ పరిశీలకులు.. వన్ టూ వన్ మీటింగ్
- కేరళ సీఎం ఎంపికకు ఏఐసీసీ కసరత్తు
- ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించిన పరిశీలకులు
- రేసులో వి.డి.సతీశన్, కేసీ వేణుగోపాల్, రమేశ్ చెన్నితాల
- ఈ నేతల మద్దతుదారుల మధ్య పోస్టర్ వార్
- మే 10కల్లా సీఎం ఎంపికపై ప్రకటన?

- మిగతా2లో





## రిసార్ట్‌కు 28మంది అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు

- హాట్ హాట్‌గా తమిళ పాలిటిక్స్
- రిసార్ట్‌లో సుమారు 28 మంది ఏఐఏడీఎంకే ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం
- అన్నాడీఎంకే పార్టీ నాయకత్వంలో విభేదాలు తలెత్తినట్లు వార్తలు

- మిగతా2లో

# సింగపూర్ తరహా అభివృద్ధికి ప్రణాళికలు

- 'నేను కాదు మనం'
- సింగపూర్ అత్యుత్తమ విధానాలతో మోడల్ జిల్లా
- ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న బలమైన వ్యవస్థలైన ఆర్టీజీఎస్, మీ భూమి, సింగిల్ డెస్క్ వంటి వాటిని సింగపూర్ మాదిరి ఒకదానితో ఒకటి అనుసంధానించాలన్న మంత్రులు




పెన్ పవర్ డెస్క్:
సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో కలెక్టర్ల సదస్సు నిర్వహించారు. ఈ క్రమంలో సింగపూర్ వెళ్లొచ్చిన మంత్రులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సింగపూర్ తరహాలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు పలు సలహాలు ఇచ్చారు. ఆర్థికపరమైన సవాళ్లను అధిగమిస్తూ ఏపీ ముందుకు వెళ్తోందని కలెక్టర్ల కాన్ఫరెన్సులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. ప్రజలకు ఏం మేలు జరుగుతుందోననే అంశాన్ని ఆలోచించి ప్రతి పైసా ఖర్చు చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన జీవితం కల్పించేలా ప్రాధాన్యతలను మార్చుకుంటూ వెళ్తున్నామన్నారు. వ్యవస్థలో లోపాలను సవరించుకుంటూ ఆదాయాలను పెంచుకోవాలని తెలిపారు. రాష్ట్రంలోని డిజిటల్ ఇన్‌ఫ్రాను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. వృధా ఖర్చులను తగ్గించుకుని అభివృద్ధి కోసం వ్యయాలను పెంచాల్సి ఉందని తెలిపారు. - మిగతా2లో



## విజయ్ ప్రమాణస్వీకారంపై క్లారిటీ ఇచ్చిన లోక్ భవన్

- గవర్నర్ నివాసం ఎదుట 'టీవీకే' ఆందోళన
- తమిళనాడులో క్షణక్షణం మారుతున్న రాజకీయ పరిస్థితులు
- గవర్నర్ ఆర్లేకర్‌తో విజయ్ భేటీపై ప్రకటన విడుదల చేసిన లోక్‌భవన్

- మిగతా2లో

# పురుగులు మందు తాగి. చికిత్స పొందుతూ యువకుడు మృతి

**ఆత్రేయపురం పెన్ పవర్ మే 7:**వెలిచేరు గ్రామంకు చెందిన అయినం రామాంజనేయులు అనే యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఐటీఐ పూర్తి చేసిన అతనికి ఇటీవల ఒక కంపెనీ నుంచి ఇంటర్వ్యూ రావడంతో ఉద్యోగానికి వెళ్లాలని తల్లిదండ్రులకు తెలిపాడు. అయితే కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో గత నెల 28న పురుగుల మందు తాగినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికు తరలించి చికిత్స అందించారు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామాంజనేయులు గురువారం పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.
ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఎస్. రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# చంద్రబాబు జన్మదినాన హామీ
# నెరవేర్చిన ఎమ్మెల్యే బండారు

**చిన్నారులకు మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి.**
**సమస్య తెలుసుకున్న వెంటనే స్పందించి పనులు పూర్తి చేయించిన సత్యానందరావు.**



**ఆలమూరు, పెన్ పవర్,మే 07;**ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో ప్రత్యేకంగా నిర్వహించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. మండల కేంద్రంలోని నాన్ భవిత పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న శారీరక, మానసిక వైకల్యాలతో బాధపడుతున్న చిన్నారుల ఇబ్బందులను గుర్తించి వెంటనే పరిష్కారం చూపించారు. గత నెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసేందుకు వెళ్లిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి అక్కడి ఉపాధ్యాయులు, విద్యార్థులు మరుగుదొడ్ల లేమి వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను తీసుకువచ్చారు. చిన్నారులు పడుతున్న ఇబ్బందులను దగ్గరగా గమనించిన ఎమ్మెల్యే వెంటనే మండల అభివృద్ధి అధికారికి ఫోన్ చేసి మరుగుదొడ్ల నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే నిర్మాణ బాధ్యతలను సీనియర్ నాయకులు, మాజీ ఏఎంసి చైర్మన్ ఈదల నల్లబాబుకు అప్పగించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వెంటనే పనులు ప్రారంభించి తక్కువ సమయంలోనే మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. సమస్యను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించడం పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా చేసిన ఈ సేవా కార్యక్రమం చిన్నారులకు నిజమైన కానుకగా మారిందని వారు పేర్కొన్నారు.



# ఇంటింటికి ప్రభుత్వ పాఠశాలల ప్రచారాలు

**తల్లిదండ్రులకు వివరిస్తున్న పరీక్ష ఫలితాలు**

**ఆలమూరు, పెన్ పవర్,మే 07;** ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసుపోకుండా ప్రభుత్వ పాఠశాలలో అద్భుతమైన ఫలితాలు వస్తున్నాయి. అయితే దేనికైనా ప్రచారం లేకపోతే ప్రజలు ఆదరించరు. అందుకనే ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు తమ పాఠశాలలో వచ్చిన పదో తరగతి పరీక్షా ఫలితాలను ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. మా పాఠశాలలో చదివితే ఇదిగో ఇలాంటి ఫలితాలు వచ్చాయని.. మీ పిల్లలు మాకు అప్పగించండి అటువంటి ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని హామీలు ఇస్తున్నారు. ఎలాంటి ఫీజులు చెల్లించనవసరం లేదని ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, దుస్తులు, భోజనం వంటి సౌకర్యాలు ఫ్రీగా కల్పిపిస్తామని వివరిస్తున్నారు. అంతేకాదు ఆ పాఠశాలలో ఎలాంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయో కూడా తెలియజేస్తున్నారు. ఆలమూరు మండలం చెముడులంక జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు భమిడిపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటికి వెళ్లి తమ పాఠశాల ప్రత్యేకతలను వివరించారు. చెముడులంకతో పాటు ఈ స్కూల్ పరిధిలో ఉన్న గాంధీనగరం, మడికి, చిలకలపాడు,మడికి, బడుగువానిలంక,చొప్పెల్ల గ్రామాలు కూడా ఇలా ఇంటింటికి వెళ్లి ప్రసారం చేపడుతున్నారు. 2026 పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఈ హైస్కూల్ నుంచి 128 మంది పరీక్షలకు హాజరుకాగా 119 మంది 98 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.వీరిలో చెల్లబోయిన తేజ అశ్విని(మడికి) 581 మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలవగా మేడిశెట్టి హరిణి(గాంధీనగరం) 577,రేలంగి శ్రీనివాస్(మడికి) 575 మార్కులతో తృతీయ ద్వితీయ స్థానాలను సాధించినట్లు వివరించారు. అలాగే 550 మార్కులు పైబడి 13 మంది విద్యార్థులు సాధించగా 500 మార్కులు పైబడి 29 మంది సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ కరపత్రాలు ద్వారా ప్రజలకు తెలియజేస్తున్నారు. ఇలా ఇంటింటి ప్రచారం ప్రతి ఒక్కరిని ఆలోచింపచేస్తుంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం తో పాటు ఎంపీపీ స్కూలు ప్రధాన ఉపాధ్యాయులు చావలి కామేశ్వరరావు, బత్తిన ప్రపూర్ణ భారతి, చెముడులంక కస్టర్ సిఆర్ఎంటి పెద్దిరెడ్డి శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ కుందేటి జ్యోతి తదితరులు ఉన్నారు.



# తల్లితండ్రుల ప్రోత్సాహం ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థుల విజయానికి కారణం.





- ఎంపీడీవో రాజు.
- పదవ తరగతి ప్రతిభావంతులకు అభినందన సత్కారం.

**ఆలమూరు, పెన్ పవర్,మే 07;**తల్లితండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం విద్యార్థుల విజయానికి కారణమని ఆలమూరు ఎంపీడీవో ఏ రాజు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో ఆలమూరు మండలంలో గల ఏడు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆలమూరు మండల యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో మండల యూటీఎఫ్ అధ్యక్షుడు జీజే పుత్ర కుమార్ అధ్యక్షతన అభినందన సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంపీడీవో రాజు, ఎంఈఓలు బి అప్పాజీ, ఎన్ రాజు మాట్లాడుతూ పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించడం ద్వారా విద్యార్థుల్లో ఉన్నత లక్ష్యాలను చేరుకునే ధైర్యం పెరుగుతుందని, విద్యార్థులందరూ ఇదే పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. చదువే సంపదని నమ్మి, క్రమశిక్షణతో చదివిన విద్యార్థులు ఆలమూరు మండలానికి మంచి పేరు తెచ్చారని అన్నారు. రాబోయే రోజుల్లో వీరికి ప్రభుత్వం తరపున మంచి ప్రోత్సాహం ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక వల్ల విద్యార్థుల విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తూ మెరుగైన ఫలితాలు సాధించగలిగారని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరచడం చాలా గర్వకారణమని, విద్యార్థులు సాధించిన ఈ అద్భుతమైన మార్కులు వారి కష్టానికి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. నియోజకవర్గ స్థాయిలోనే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ మన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం అభినందనీయమని అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి విజయానికి వెన్నంటి నిలిచిన తల్లిదండ్రులకు, విద్యార్థులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయుల కృషిని అభినందించారు. క్రమశిక్షణతో కృషి చేస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, సమాజం పట్ల బాధ్యతగల పౌరులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్ కుమార్, ఈదల సత్యనారాయణ (నల్లబాబు) రామానుజుల శేషగిరిరావు, సంగీత సుభాష్, కేతా రాంబాబు, సాలి సత్యనారాయణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

**విద్యార్థుల తల్లిదండ్రుల స్పందన.**
విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, మౌలిక వసతుల కల్పనతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు సాధించడం సాధ్యమైందని తెలిపారు.

**విద్యార్థుల స్పందన**
మా కుటుంబ పెద్దల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల తర్ఫీదు తమ విజయానికి ప్రధాన కారణమని అన్నారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ గా ఎదిగి ప్రజలకు ఉత్తమ పరిపాలన అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

# పనికి వెళ్లమని మందలించడంతో మనస్తాపం.. యువకుడు మృతి

**ఆత్రేయపురం పెన్ పవర్ మే 7:**ఆత్రేయపురం మండలంలోని వెలిచేరి గ్రామంకు చెందిన సంఘ దుర్గాప్రసాద్ (26) ఏ పనికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉంటున్నాడు. ఈ క్రమంలో పనికి వెళ్లకపోతే కుటుంబం ఎలా గడుస్తుందని తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపానికి గురైన అతడు గత నెల 30వ తేదీన పురుగుల మందు తాగినట్లు సమాచారం. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికు తరలించి చికిత్స అందించారు. అయితే గురువారం పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు ఆత్రేయపురం ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ప్రతి గురువారం వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ కార్యక్రమం-ఎంపీడీఓ రాజు

**ఆలమూరు, పెన్ పవర్,మే 07;**ఆలమూరు మండలంలో ప్రజలకు మరింత చేరువగా పాలన అందించేందుకు "వన్ మంత్ -- వన్ విలేజ్ -- ఫోర్ విజిట్స్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎ. రాజు తెలిపారు. మండల తహసిల్దార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజల ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కారం చూపించే దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీవో ఎ. రాజు మాట్లాడుతూ, ప్రతి గురువారం ఒక గ్రామాన్ని నాలుగు సార్లు సందర్శిస్తూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని తెలిపారు. అనంతరం తహసిల్దార్ ప్రకాష్ బాబు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పెన్షన్లు, రేషన్, ఆదాయ ధృవపత్రాలు, భూ సంబంధిత సమస్యలు, సామాజిక భద్రత అంశాలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలని తహసిల్దార్ సూచించారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


# వైసీపీ దళారుల మాయమాటలకు రైతులు మోసపోవద్దు

**మంత్రి వాసంశెట్టి సుభాష్**

**రామచంద్రపురం/అమరావతి, పెన్ పవర్,మే 7:** రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, వైసీపీ దళారుల మోసపూరిత మాటలను నమ్మి నష్టపోవద్దని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. కొంతమంది వైసీపీ దళారులు స్పాట్ క్యాష్ పేరుతో రైతులను ప్రలోభపెట్టి తక్కువ ధరలకు ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, అలాంటి వారి పట్ల అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కంటే ఒక్క రూపాయి కూడా తగ్గకుండా మిల్లర్లు, ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల ద్వారానే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని మంత్రి స్పష్టం చేశారు.రైతులను తప్పుదోవ పట్టిస్తూ ఫేక్ ధర్నాలు, అసత్య ప్రచారాలకు వైసీపీ పాల్పడటం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో "రైతే రాజు" అనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు.రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం అమ్మిన రైతులు డబ్బుల కోసం నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతులు ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటినీ తమ ప్రభుత్వం చెల్లించిందని గుర్తు చేశారు.అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ చేస్తున్న విష ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని మంత్రి పిలుపునిచ్చారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, అన్నదాతలకు అన్ని విధాలా అండగా నిలుస్తామని మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు.ధాన్యం సేకరణ కేంద్రాల్లో ఏవైనా సమస్యలు ఉంటే రైతులు నేరుగా తన కార్యాలయానికి తెలియజేయాలని మంత్రి సూచించారు.



# రాష్ట్రంలో ఉన్న లక్షలాది ఎకరాలు సీలింగ్ భూములు పేదలకు పంచాలి.

- అల్లూరి 102 వ వర్ధంతి కార్యక్రమంలో కర్నాకుల డిమాండ్.





**కిర్లంపూడి, పెన్ పవర్, మే 7:**రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన మన్యశీ వీరుడు, విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 102 వ వర్ధంతి వేడుకలు కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి,కె సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వతంత్రం కోసం, పీడిత జన విముక్తి కోసం అలుపెరుగని పోరాటం చేసి వేలాది ఎకరాలు భూములు సాధించి పేద ప్రజలకు పంచిపెట్టారన్నారు. అల్లూరికి నివాళులు అర్పించడం అంటే పూలమాలలు వేయడం కాదని,ఆయన ఆశయాలను, సిద్ధాంతాలను, పోరాటాలను ముందుకు తీసుకుని వెళ్లాలని, అదే ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అని కర్నాకుల అన్నారు.

ఆంధ్రప్రదేశ్ లో లక్షలాది ఎకరాలు సీలింగ్, ప్రభుత్వ పోరంబోకు భూములు బడా భూస్వాముల చేతుల్లోనే ఉన్నాయని వాటిని పేద ప్రజలకు పంచి పెట్టాలని కర్నాకుల డిమాండ్ చేశారు.అనంతరం చెంతనే ఉన్న కర్నాకుల వీరాంజనేయులు తల్లిదండ్రుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు కె రామలింగేశ్వర రావు, డాన్ శ్రీను, కర్నాకుల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్స్ కి కనీస వేతనం ఇవ్వాలని సిఐటియు డిమాండ్



**గండేపల్లి, పెన్ పవర్, మే 07:** ఆశ వర్కర్స్ కి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈరోజు గండేపల్లి సీఐటీయూ ఆఫీస్ నందు సమావేశం జరిగింది ఈ సమావేశంలో మన్యం వీరుడు విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది సిఐటియు ఆశా వర్కర్స్ యూనియన్ రి. నెం 102. మండల కన్వీనర్ నొక్కు లలిత మండల అధ్యక్షులు కారీ శాంతి పూలమాలవేసి నివాళు లర్పించడం జరిగింది ఈ సందర్భంగా ఆశా వర్కర్స్ కి గత ఏడు సంవత్సరాల నుండి ఏ ప్రభుత్వం వచ్చినా జీతం పెంచకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు నిత్యవసర సరుకులు ధరలు చూస్తే ఆకాశాన్నంటాయి కానీ ఆశా వర్కర్స్ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య మొండి వైఖరి తగదన్నారు తక్షణమే ప్రభుత్వం ఆశ వర్కర్లకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు ఆశ వర్కర్లు క్రింది స్థాయిలో ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ చూస్తూ కీలకపాత్ర పోషిస్తున్నారు పక్కనే ఉన్న పాండిచ్చేరి రాష్ట్రంలో ఆశ వర్కర్లకు 18000 వేతనం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆశ వర్కర్స్ కి ఏమో వరాల కురిపించేసినట్లుగా ప్రకటనలు తప్ప ఏమీ లేదన్నారు తక్షణమే ఆశా వర్కర్స్ యొక్క సమస్యలను పరిష్కరించాలని పరిష్కరించని యెడల మాజ పోరాటాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి విష్ణు లక్ష్మి, శివ గంగ, లక్ష్మి, సత్యవతి, బేబీ, భవాని, వీర వెంకట లక్ష్మి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు

# నత్త నడకన నడుస్తున్న పుష్కర పనులను వేగవంతం చేయండి





- పాటంశెట్టి సూర్యచంద్ర
- ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి
- పుష్కర ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన పాఠం చెట్టి సూర్యచంద్ర

**గండేపల్లి, పెన్ పవర్, మే07:**గండేపల్లి మండలం తాళ్లూరు ఎత్తిపోతల పథకాన్ని గురువారం ఇండిపెండెంట్ అభ్యర్థి పాఠం శెట్టి సూర్యచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ పుష్కర పునర్నిర్మాణ పనులు నత్త నడకన నడవడం వల్ల ఈ సంవత్సరం కూడా పుష్కర సాగునీరు రాదేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని సూర్యచంద్ర తెలిపారు.మెగా ఇంజనీరింగ్ కంపెనీ ద్వారా ఫిబ్రవరి ఆరవ తేదీన పని ప్రారంభించారని 90 రోజులలో 20 ప్రోక్లైనర్లు ,20 హైడ్రాలతో భూమిలో మూడు లైన్లలో ఉన్న 2100 పైపులు తీయాల్సి ఉండగా, రెండు ప్రోక్లైనర్ లు రెండు హైడ్రాలతో కేవలం 300 పైపులు మాత్రమే తీశారని ఎమ్మెల్యే గారు, అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయని సూర్యచంద్ర తెలిపారు. జూలై మొదటి వారంలో రైతులకు ఈ పథకం ద్వారా 37 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాలంటే మిగిలి ఉన్న సమయం 60 రోజులని, ఈ 60 రోజులలో చేయాల్సిన పనులు పంపు హౌస్ లో ఉన్న మొత్తం మోటర్లు, పంపులు కొత్తవి వేయటం, కొన్ని రిపేర్లు చేయుట,ఎలక్ట్రికల్ సబ్స్టేషన్ కొత్త ట్రాన్స్ఫార్మర్లు కొత్త వైరింగ్ ఆధునీకరణ చేయుట,మూడున్నర కిలోమీటర్లు పొడవు ఉన్న మూడు పైపులైన్లలో ఉన్న 2100 సిమెంట్ పైపులు బయటకు తీయుట,మూడున్నర కిలోమీటర్లు రెండు పైపులైన్లకు ఇసుకతో లెవెలింగ్ చేయుట,మూడున్నర కిలోమీటర్లలో రెండు లైన్లలో వేయుటకు గాను 1400 ఎమ్మెస్ పైపులు హైదరాబాదు నుండి రప్పించి ప్రతి పైపునకు లోపల, బయట ఐరన్ మెష్ తో కూడిన సిమెంట్ కాంక్రీట్ పొర వేయడం, పైపులు భూమిలోకి దింపిన తర్వాత వెల్డింగ్ చేసి జాయింట్ కలుపుట,సాగు నీరు సక్రమంగా ప్రవహించుటకు గాను పూడుక, తుప్పలు, డొంకలతో నిండిపోయిన ప్రధాన కాలువ మరియు పిల్ల కాలువలు శుభ్రపరచుట మరియు పైపులైన్ల నుండి తీసిన 2100 పాత సిమెంట్ పైపులు వృధా కాకుండా జగ్గంపేట నియోజకవర్గంలో అనేక గ్రామాలలో రైతులకు రవాణా సౌకర్యం నిమిత్తం పంట కాలువలపై పైపు కల్వర్టులు నిర్మించుటకు గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి , స్థానిక కలెక్టర్ వారి కి, ఎంపీ,ఎమ్మెల్యే గార్లకు ఒకటో నెల 21, 2025 తేదీన రైతుల పక్షాన మేము రాసిన లేఖ ద్వారా... ప్రభుత్వ ఆదేశములు ఐ సి డి ఓ 1/1648/2025 20-02-2025 ) ద్వారా రైతులకు తీసివేసిన 2100 పైపులు సరఫరా చేయుట వంటి అత్యవసర పనులు సకాలంలో పూర్తి చేసినప్పుడే ఈ పథకం పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగపడుతుందని నత్తనడకన జరుగుతున్న తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయట ద్వారా రైతన్నలకు సకాలంలో సాగునీరు ఇవ్వాలన్నదే మా ప్రధాన సంకల్పమని సూర్యచంద్ర తెలిపారు. స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ సమకూర్చిన 52 కోట్ల రూపాయలు నిధుల ద్వారా సకాలంలో పనులు జరిగి రైతన్నలకు సాగునీరు ఈ సంవత్సరం అందివ్వాలి అంటే శాసనసభ్యులు శ్రీ జ్యోతుల నెహ్రూ గారు ప్రతి వారం పనుల పురోగతిపై సందర్శన మరియు అధికారులతో, కాంట్రాక్టర్లతో సకాలంలో సాగునీరు ఇవ్వటం కోసం సమీక్ష సమావేశాలు నిర్వహించాలని, రోజువారీ ప్రగతి తెలుసుకుని ఈ సంవత్సరం నీరు ఇచ్చే విధంగా యుద్ధ ప్రాతిపదికన తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకం పునర్నిర్మాణ పనులు జరిగే విధంగా తగిన బాధ్యతలు తీసుకోవాలని పాటంశెట్టి సూర్యచంద్ర కోరారు.



# పులిదిండి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేయాలని గ్రామస్తుల వినతి

ఆత్రేయపురం తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తికి వినతి పత్రం



**ఆత్రేయపురం పెన్ పవర్ మే 7:**పులిదిండి గ్రామానికి చెందిన గ్రామస్తులు గురువారం ఆత్రేయపురం తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తికు వినతి పత్రాన్ని సమర్పించారు. గ్రామంలో ఇప్పటివరకు గ్రామ సచివాలయం ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రస్తుతం గ్రామ ప్రజలు చిన్నచిన్న ప్రభుత్వ అవసరాలు, ధృవపత్రాలు, పింఛన్లు, రేషన్, ఆదాయ నివాస ధృవపత్రాల కోసం పక్క గ్రామమైన వసంతవాడకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. వసంతవాడ గ్రామం సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రతి చిన్న పనికీ అక్కడికి వెళ్లడం ప్రజలకు భారంగా మారిందన్నారు.ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. వర్షాకాలంలో రాకపోకలు మరింత కష్టతరంగా మారుతున్నాయని, అత్యవసర పరిస్థితుల్లో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రభుత్వ సేవలు గ్రామ స్థాయిలో అందుబాటులోకి రావాలంటే పులిదిండి గ్రామంలోనే సచివాలయం ఏర్పాటు చేయడం అత్యవసరమని గ్రామ పెద్దలు అభిప్రాయపడ్డారు.

గ్రామ ప్రజల సమస్యలను ఓర్పుగా విన్న తహశీల్దార్ ఆర్.డి. రామచంద్రమూర్తి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రైతులకు మద్దతు ధర లభిస్తుందా..?

రైతు సేవా కేంద్రాలను తనిఖీ చేసిన డీసీఓ బాలినేని శ్రీనివాసరెడ్డి



**కాజులూరు, పెన్ పవర్,మే 7:** కాజులూరు మండలంలోని రైతు సేవా కేంద్రాలను జిల్లా సహకార అధికారి (డీసీఓ) బాలినేని శ్రీనివాసరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతున్నదా, రైతులకు సకాలంలో చెల్లింపులు అందుతున్నాయా అనే అంశాలపై ఆయన ప్రత్యేకంగా పరిశీలించారు.మండల పరిధిలోని తణుకువాడ, గొల్లపాలెం, జగన్నాథగిరి, తర్లంపూడి, పెనుమళ్ళ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించిన డీసీఓ అక్కడ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, ట్రక్ సీట్లు, ధాన్యం కొనుగోలు రికార్డులను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడిన ఆయన, రైతు సేవా కేంద్రాలకు ధాన్యం ఇచ్చిన తర్వాత 24 గంటల్లో చెల్లింపులు జరుగుతున్నాయా, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర అందుతున్నదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, రైతులకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

ఈ తనిఖీల్లో మానిటరింగ్ ఆఫీసర్ శివకామేశ్వరరావు, విజయ్ కుమార్, సొసైటీ అధ్యక్షుడు అంగర కృష్ణ, సొసైటీ కార్యదర్శి మూలారెడ్డి,అగ్రికల్చర్ అసిస్టెంట్ కె.వి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర పోరాటంలో అల్లూరి సేవలు మరువలేనివి.



-పీసీసీ సభ్యులు ధరణాల కోట శ్రీను.

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మే 7:** స్వాతంత్ర్య పోరాటంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు దేశానికి అందించిన సేవలు మరువలేనివని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు ధరణాలకోట శ్రీను అన్నారు. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పిసిసి సభ్యులు ధరణాలకోట శ్రీను ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు భారతదేశ స్వతంత్రం కోసం, పీడిత జన విముక్తి కోసం అలుపెరిగిన పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈకార్యక్రమంలో కందిమళ్ల స్యామేలు,గాలి వెంకటరమణ.పిల్లిరాజు. తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ కు వినతి పత్రం అందజేసిన దళిత క్రైస్తవులు




**అల్లవరం,పెన్ పవర్, మే 07:**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా క్రైస్తవ జేఏసీ నాయకులు గురువారం అల్లవరం మండలం గోడిలోని ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ని కలిసి దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రిస్టియన్ల పై దాడులు పెరిగిపోయాయి అని, క్రిస్టియన్లకు రక్షణ లేకుండా పోయిందని జిల్లా జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి అని ,1950 రాష్ట్రపతి ఆర్డర్ రద్దు చేయాలి అని కోరారు.,ఇక్కడతో ఈ పోరాటం ఆగదని, ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చేవరకు క్రైస్తవ ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా ఇజ్రాయిల్ మాట్లాడుతూ రాబోయే శాసన మండలి సమావేశాల్లో ముఖ్యంగా ఈ సమస్య గురించి ప్రస్తావిస్తానని, దళిత క్రిస్టియన్లకు ఎస్సీ హోదా కల్పించడంలో నా వంతు సహాయం చేస్తానని జేఏసీ నాయకులకు తో అన్నారు ఈ కార్యక్రమంలో క్రైస్తవ జేఏసీ నాయకులు నోబుల్ రాయ్,యెహోషువ, యు.వి భాస్కరరావు, స్పార్జన్ రాజు, ఎం. జాన్ పాల్, పీ మార్టిన్, ఎన్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి

**కాకినాడ, పెన్ పవర్,మే 7:** మన్య వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతిని పురస్కరించు కుని కాకినాడ కలెక్టరేట్‌లో గురువారం ఘనంగా నివాళులర్పించారు.జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో కలిసి అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సాగించిన పోరాటం భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో చిరస్మర ణీయమని పేర్కొన్నారు. అపారమైన ధైర్యసాహసాలతో స్వాతంత్ర్య సమరంలో పోరాడిన అల్లూరి సీతారామరాజు 1924 మే 7న వీరమరణం పొందారని గుర్తు చేశారు.యువత అల్లూరి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని జేసీ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఎన్. నాగమల్లేశ్వరరావు,సీపీవో పి. త్రీనాథ్,కలెక్టరేట్ ఏవో ఎస్. రామ్మోహన్,వివిధ శాఖల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.








## గ్రామీణ ప్రజలకు వరంగా 104 వైద్య సేవలు





**-- సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శ్రేయ పిలుపు**

**కాజులూరు, పెన్ పవర్,మే 7:** గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను చేరువ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 104 మొబైల్ వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సి.ఎల్.వి.శ్రేయ పిలుపునిచ్చారు.
కాజులూరు మండలంలోని గొల్లపాలెం చీకట్లవారిపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన 104 వైద్య సేవా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెల మొదటి గురువారం, మూడవ మంగళవారం ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సేవల ద్వారా గ్రామీణ ప్రజలకు ఉచితంగా ఈసీజీ, బీపీ, ఆర్‌బీఎస్, హెచ్‌బీఎస్ వంటి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చిన్నచిన్న ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు 104 సేవలు ఎంతో ఉపయోగపడుతున్నాయని వివరించారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని సూచించారు.గ్రామాలకు నేరుగా వెళ్లి వైద్య సేవలు అందించడం ద్వారాఆసుపత్రులకు వెళ్లలేని పేద ప్రజలకు ఇది ఎంతో మేలు చేస్తోందన్నారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడం, వ్యాధులను ముందుగానే గుర్తించడం లక్ష్యంగా ప్రభుత్వం 104 సేవలను సమర్థవంతంగా అమలు చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీఈవో రాధాకృష్ణ,ఎంఎల్‌హెచ్‌పీ జి. సంధ్య, హెల్త్ అసిస్టెంట్ ఏ. శ్రీనివాసరావు, ఏఎన్ఎం జి. రామలక్ష్మి,ఆశా వర్కర్లు జి. దుర్గాదేవి,భవాని,104 సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.







✷ **బిజెపి నాయకులు అల్లు శివరామకృష్ణ.**

**కిర్లంపూడి, పెన్ పవర్, మే 7:** చలివేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ బిజెపి నాయకులు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు అల్లు శివరామకృష్ణ అన్నారు. కిర్లంపూడి మండలం గోనేడ గ్రామంలో అల్లు శివరామకృష్ణ తండ్రి అల్లు తాతయ్య (చిన్నబ్బాయి) పేరు మీద చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి గురువారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.తొలుత శివరామకృష్ణ తండ్రి అల్లు తాతయ్య ( చిన్నబ్బాయి) విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లు అర్పించారు.ఈ సందర్భంగా అల్లు శివరామకృష్ణ మాట్లాడుతూ మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ట్రస్ట్ పేరు మీద గ్రామంలో చలివేంద్రాన్ని ప్రారంభించి తొలిరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ట్రస్ట్ పేరు మీద పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గోకాడ రాజా, భీమనాదుల వీరబాబు, కొప్పన కృష్ణ, పసుపులేటి సత్యనారాయణ, కొప్పన రాంబాబు, అరటా పెద్ద పోలీసు, నీలం బాబులు, కడియాలు చిన్న, కొప్పన సూరిబాబు, బలం రమణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

**అల్లూరి సేవలు మరువలేనివి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**






**గండేపల్లి, పెన్ పవర్, మే 07:**స్వర్గీయ అల్లూరి సీతారామరాజు భారతదేశానికి చేసిన సేవలు ఎన్నటికీ ఎప్పటికీ మరువలేనివని జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి సభ్యులు, తెదేపా పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా క్షత్రియ సేవా సమతి

ఆధ్వర్యంలో ఆయన విగ్రహ ప్రతిష్ట గురువారం అంగరంగ వైభవంగా అతిరథ మహారథుల రాజవంశీకుల ఆధ్వర్యంలో జరిగింది. గండేపల్లి మండలం నీలాద్రి రావు పేట పంచాయతీ పరిధి లోని క్షత్రియ కళ్యాణ మండపం వద్ద గురువారం ప్రతిష్టించిన అల్లూరి సీతారామరాజు విగ్రహ దాత ఆ యుర్వేద వైద్యుడు, ధన్వంతరి సహస్రాయ పీఠం అధ్యక్షుడు గొట్టిముక్కల సూర్యనారాయణ వర్మ అలియాస్ రవి వర్మ పాల్గొన్నారు. బ్రిటిష్ వారిని ఆ రోజుల్లో ధైర్యసహసాలతో అల్లూరి సీతారామరాజు స్వాతంత్రం రాకముందు పోరాడాడని ఆయన సేవలు చరిత్ర పుటల్లో ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. బాలలు రేపటి పౌరులుగా చరిత్రలో లిఖించబడిన ప్రతి ఒక్కరి సేవలను గుర్తు చేసుకున

జీవనం సాగించాలని అప్పుడే భారత ఉనికి వన్నెతెచ్చినట్టు అవుతుందని జగ్గంపేట ఎమ్మెల్యే టిటిడి సభ్యులు పోలీస్ బ్యూరో సభ్యుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. అల్లూరి పోరాట ప్రతిమను దృష్టిలో పెట్టుకునే తాను ప్రజలకు సేవ చేసే భాగ్యం కలిగిందని అందువల్లే రాజకీయ రంగాన్ని ఎంపిక చేసుకొని ప్రజలకు సేవలు అందించే అదృష్టం తనకు లభించింది అన్నారు. నెహ్రూ స్వగ్రావమైన ఇర్రిపాక గ్రామంలో అల్లూరి సీతారామరాజు బస చేసిన రోజుల్లో స్వయంగా తన తాత వెండి నాణేలను ఆయనకు సమర్పించడం జరిగిందన్నారు. ఈ విషయం రాజవొమ్మంగి స్టేషన్లో ఇప్పటికీ లిఖితపూర్వకంగా ఉందని ఆయన అన్నారు. అల్లూరి విగ్రహ ప్రతిష్ట దాత ఆయుర్వేద వైద్యుడు గొట్టిముక్కల సూర్యనారాయణ వర్మ మాట్లాడుతూ అల్లూరి జీవితం ప్రతి ఒక్కరు తెలుసుకొని జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఎటువంటి కమ్యూనికేషన్ డిజిటల్ నెట్వర్క్ లేని సమయంలో ఎంతో శ్రమతో కూడిన నిబంధనలను పాటిస్తూ బ్రిటిష్ వారిని భారతదేశం నుంచి తరిమి కొట్టడానికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ ఇప్పటికీ మరువలేనివని ఆయన అన్నారు. అటువంటి స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ప్రతిష్టించే అదృష్టం తనకు కలిగిందని రవివర్మ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాసనసభ్యులు దాట్ల బుచ్చిరాజు, ఇందుకూరి రఘురాజు, పచ్చమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, పాకలపాటి రవి వర్మ, దాట్ల సూర్యనారాయణ రాజు, కేవీపీ సత్యనారాయణ రాజు, రాజా సూరిబాబు రాజు, మీసాల రాజు, ఎస్వీఎస్ అప్పలరాజు, తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, త్యాగాలపై అతిధులందరూ ప్రసంగించారు. అల్లూరి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. అల్లూరి సీతారామరాజు ఇర్రిపాక గ్రామంలో ఒకరోజు బస చేసినప్పుడు తన తాత 108 వెండి నాణాలను విరాళంగా అందించారని, ఆ వివరాలు ఇప్పటికీ రాజ ఒమ్మంగి పోలీస్ స్టేషన్ రికార్డుల్లో ఉన్నాయని తెలిపారు. అల్లూరి స్ఫూర్తితోనే తాము రాజకీయంగా పోరాటాలు చేస్తున్నామని అన్నారు.

ఈ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, అల్లూరి అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జగ్గంపేట క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## చైన్ స్నాచింగ్, ఇంటి దొంగతనాలు, బైక్ చోరీల కేసుల్లో ముగ్గురు అరెస్ట్

✷ రూ.50 లక్షలకు పైగా సొత్తు రికవరీ





**కాకినాడ, పెన్ పవర్,మే 7:** కాకినాడ, కోనసీమ జిల్లాల్లో వరుస చైన్ స్నాచింగ్‌లు, ఇంటి దొంగతనాలు, మోటార్‌సైకిల్ చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను కాకినాడ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి,రూ.50 లక్షలకు పైగా విలువైన బంగారం,వెండి వస్తువులు, వాహనాలను రికవరీ చేశారు.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ పాటిల్ దేవ్‌రాజ్ మనీష్ పర్యవేక్షణలో కాకినాడ క్రైమ్ సీఐ వి. కృష్ణ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు ఈ కేసులను ఛేదించాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడ ×× టౌన్ పోలీసులు 7 చైన్ స్నాచింగ్ కేసులు, ఒక ఇంటి దొంగతనం, ఒక ఏటీఎం కార్డు మోసం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 320 గ్రాముల బంగారం, 600 గ్రాముల వెండి, రూ.40 వేల నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.వీటి మొత్తం విలువ రూ.46.50 లక్షలు.అలాగే సర్పవరం పోలీసులు ఒక ఇంటి దొంగతనం, రెండు బైక్ చోరీ కేసుల్లో మరో నిందితుడిని అరెస్ట్ చేసి 430 గ్రాముల వెండి,మూడు మోటార్‌సైకిళ్లను రికవరీ చేశారు.వీటి విలువ రూ.3.66 లక్షలు. మొత్తం 12 కేసుల్లో రూ.50.16 లక్షల సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన నిందితులు పల్లా సురేంద్ర కుమార్, రంగాల శ్రీనివాసరెడ్డి, రచ్చ నాగ సతీష్ కుమార్ అలియాస్ బబ్లుగా పోలీసులు గుర్తించారు. వీరిపై గతంలో కూడా అనేక కేసులు నమోదై ఉన్నట్లు తెలిపారు.నిందితులు ఒంటరిగా వెళ్తున్న మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడేవారని, ఏటీఎంల వద్ద సహాయం చేస్తున్నట్లు నటించి కార్డులు మార్చి నగదు దోచుకునేవారని పోలీసులు వెల్లడించారు.అలాగే తాళాలు వేసిన ఇళ్లను గుర్తించి దొంగతనాలు, ఇంటి బయట పార్క్ చేసిన బైక్‌లను చోరీ చేసేవారని తెలిపారు.చైన్ స్నాచింగ్ నిందితులను మే 6 రాత్రి కాకినాడ--సామర్లకోట రోడ్డులోని జెడ్ బ్రిడ్జ్ వద్ద అరెస్ట్ చేయగా, మరో నిందితుడిని వలసపాకల గ్రామంలో అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ మాట్లాడుతూ నిందితులను పట్టుకోవడంలో కీలకంగా పనిచేసిన ఏఎస్పీ పాటిల్ దేవ్‌రాజ్ మనీష్, సీసీఎస్ ఇన్స్పెక్టర్ వి. కృష్ణ, కాకినాడ ×× టౌన్ ఎస్సై బుజ్జిబాబు, సర్పవరం ఎస్సై ఎం. ఏసుబాబు మరియు సిబ్బందిని అభినందించారు.ప్రజలు అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏటీఎంల వద్ద పిన్ నంబర్లు చెప్పవద్దని, ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌ను వినియోగించాలని పోలీసులు సూచించారు.

## అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు


**జిల్లా ఎస్పీ బిందు మాధవ్**

**కాకినాడ, పెన్ పవర్,మే 7:** మన్యం వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన ప్రాంతానికి చెందిన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడని, మన్యం ప్రజల కోసం, దేశ స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన మహా యోధుడని కొనియాడారు. ఆయన త్యాగస్ఫూర్తి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవ్‌రాజ్ మనీష్, ఎస్బీ డీఎస్పీ కెవివి సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అందరూ అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.



# కోలంకలో రైతులకు కొత్త పట్టాదారు పాసుబుక్కుల పంపిణీ





- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వం
- వాసంశెట్టి సత్యం

**కాజులూరు, పెన్ పవర్ మే 7**: కూటమి ప్రభుత్వం వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తోందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. కాజులూరు మండలం కోలంక గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభలో రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు వాసంశెట్టి సత్యం, మండల తహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలు, రైతుల ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం రీ-సర్వే నిర్వహించి రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాసుబుక్కులను రైతులకు అందజేస్తోందన్నారు. రైతుల కోసం ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. రైతులు విక్రయించిన ధాన్యానికి 24 గంటల్లోనే నగదు చెల్లింపులు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు.

మండల తహసిల్దార్ జి. రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ కాజులూరు మండలంలో సుమారు 1900 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమం కోసం గ్రామసభలు నిర్వహించి రైతుల ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తి చేసి పాసుబుక్కులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమాన్ని వేగవంతంగా అమలు చేసేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గురువారం కోలంక గ్రామంలో 110 మంది రైతులకు పట్టాదారు పాసుబుక్కులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ ఎం. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి. వేగేశ్వరరావు, మండల జనసేన అధ్యక్షుడు బొండా వెంకన్న, కోలంక సొసైటీ అధ్యక్షుడు బొండా వెంకట నరసింహనాయుడు, కోటిపల్లి డీసీసీ దాట్ల విజయగోపాలరాజు, కోలంక గ్రామ కమిటీ అధ్యక్షుడు దాట్ల బుచ్చిబాబు రాజు, మాజీ సహకార సంఘ అధ్యక్షులు దంతులూరి వెంకట నరసింహరాజు, భూపతిరాజు రామచంద్రరాజు, దూడల రామగంగారావు, దంతులూరి వంశీ, గ్రామ రెవెన్యూ అధికారులు సూర్యనారాయణమూర్తి, ధరణి పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ ఏవీఎస్ సూర్యనారాయణరాజు





**కాకినాడ, పెన్ పవర్,మే 7**: బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఇకపై మరింత పకడ్బందీగా వ్యవహరిస్తుందని కమిషన్ ఛైర్మన్ వేటుకూరి సూర్య నారాయణ రాజ తెలిపారు. కాకినాడ జిల్లాను బాలల స్నేహపూరిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్‌లోని వివేకానంద సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షత వహించగా, కమిషన్ సభ్యులు కె.జి. వెంకట పద్మలత, ఉండవల్లి గాంధీబాబు, చల్లా మధుసూదన్ రావు, డి. శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలల కోసం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి చిన్నారికి చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లలు ఎవరూ బడి బయట ఉండకూడదని, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. బాల్య వివాహాల నివారణకు గ్రామ,మండల, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్కూళ్లలో పిల్లలకు సురక్షిత, అసురక్షిత స్పర్శలపై అవగాహన కల్పించాలని సూచించారు.

పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సరైన ఆధారాలతో దర్యాప్తు చేయాలని పోలీసు శాఖకు సూచించారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల పట్ల వివక్ష చూపరాదని హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషక విలువలు కలిగిన మొలగ చెట్లను పెంచాలని అధికారులను ఆదేశించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి ఐసీడీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, వన్ స్టాప్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన జడ్పీహెచ్ఎస్ సంపర విద్యార్థిని డి. చిన్నారి, తుని జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని హర్షిణిని కమిషన్ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి సి.హెచ్. వెంకటరావు, వివిధ శాఖల అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సిబ్బంది పాల్గొన్నారు.

# ఖరీఫ్ సీజన్ లో రైతులకు న్యాణ్యమైన విత్తనాలు విక్రయించాలి.

మండల వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత.





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, మే 7:** వచ్చే ఖరీఫ్ సీజన్ లో రైతులకు న్యాణ్యమైన విత్తనాలు విక్రయించాలని ప్రత్తిపాడు మండలం వ్యవసాయ శాఖ అధికారిణి జోకా అమృత డీలర్లను ఆదేశించారు. మండలంలోని ఒమ్మంగి, ఏలూరు గ్రామాలలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లో ఎరువుల నిల్వలు,పురుగుమందుల రికార్డ్స్ తనిఖీ చేసారు. ఈ సందర్భంగా జోకా అమృత మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ కి సంబంధించి రైతులకు నాణ్యమైన విత్తనాలు ,ఎరువులు విక్రయించడమే కాకుండా,రైతులు ఎరువులు ,పురుగుమందులు,విత్తనాలు కొన్నప్పుడు వారికి విధిగా బిల్లు ఇవ్వాలని చూచించారు. రైతులకు విత్తనాలు ఇచ్చే ముందు మొలక శాతం కట్టిన తర్వాత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం నిషేధిత పురుగుమందులను నిల్వ అయిపోయిన మందులను అమ్మకూడదని తెలిపారు.

## జగ్గంపేట బస్టాండ్ లో ఆర్ఓ ప్లాంట్, కూలింగ్ ఫ్రిడ్జ్ ప్రారంభం



**జగ్గంపేట, పెన్ పవర్, మే 7** : జగ్గంపేట ఆర్.టి.సి. బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం జగ్గంపేట వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధి చేసిన చల్లని త్రాగునీటి ఆర్ఓ ప్లాంట్, కూలింగ్ ఫ్రిడ్జ్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు నడక ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ తోటివారిని కూడా ప్రోత్సహిస్తున్నారని కొనియాడారు. సమాజ సేవలో కూడా ముందుండటం అభినందనీయమని అన్నారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు మానేపల్లి వీర కుమారి, పృధ్వీ కృష్ణ జ్ఞాపకార్థం వాకర్ మానేపల్లి వెంకటేశ్వరరావు రూ.లక్ష విరాళం అందించారు. దాతను ఎమ్మెల్యే నెహ్రూ దుశ్శాలువాతో సత్కరించారు. డిస్ట్రిక్ట్ 103 గవర్నర్ తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ వాకర్స్ హెల్త్ క్లబ్ జగ్గంపేట స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రజతోత్సవ కానుకగా ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఏలేశ్వరం డిపో మేనేజర్ జివి సత్యనారాయణ మాట్లాడుతూ నిత్యం వేలాది మంది ప్రయాణించే జగ్గంపేట కాంప్లెక్స్‌లో చల్లని శుద్ధి నీటిని అందించడం వాకర్స్ క్లబ్ సేవా నిరతికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, క్లబ్ అధ్యక్షులు పొట్టి వీర్రాజు, క్యాబినెట్ సెక్రటరీ ఎం. మల్లేశ్వరరావు, కోశాధికారి వెత్సా నాగ సత్య, బులెటిన్ ఎడిటర్ ముమ్మిడివరపు సురేష్, కార్యదర్శి మానేపల్లి సతీష్, కోశాధికారి ఎన్. శ్రీనివాస్, సీనియర్ వాకర్స్ చంద్రమౌళి వెంకట శాస్త్రి, సువార్త పాల్, ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె.రుక్మిణీ దేవి, కొత్త నాగ పండు, మానేపల్లి వీర్రాజు గుప్తా, కర్రి సత్తిబాబు, సుంకర శ్రీనివాస్, మానేపల్లి వెంకటేశ్వరరావు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహావిష్కరణ



**జగ్గంపేట, పెన్ పవర్, మే 7:** క్షత్రియ సేవా సమితి జగ్గంపేట ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం గురువారం జగ్గంపేట గోకవరం రోడ్డులోని క్షత్రియ కళ్యాణ మండపం వద్ద అంగరంగ వైభవంగా జరిగింది. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు దాట్ల బుచ్చిరాజు, ఇందుకూరి రఘురాజు, పచ్చమట్ల ధర్మరాజు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్, పాకలపాటి రవి వర్మ, దాట్ల సూర్యనారాయణ రాజు, కేవీపీ సత్యనారాయణ రాజు, రాజా సూరిబాబు రాజు, మీసాల రాజు, ఎస్వీఎస్ అప్పలరాజు, తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. విగ్రహ దాత, ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, ధన్వంతరి సహస్రాయు పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు గొట్టిముక్కల సూర్యనారాయణ వర్మ అలియాస్ రవి వర్మను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, అతిథులు ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. హాజరైన అతిథులందరికీ అల్లూరి సీతారామరాజు ప్రతిమలను జ్ఞాపికలుగా అందించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అతిథులు అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్ర, త్యాగాలపై ప్రసంగించారు. అల్లూరి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ అల్లూరి త్యాగాన్ని, దేశభక్తిని నేటి తరానికి చాటిచెప్పాలని, అల్లూరి కుటుంబాన్ని అందరం కలిసి ఆదుకోవాలని పిలుపునిచ్చారు. జగ్గంపేట క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

## అల్లూరి సీతారామరాజుకు ఘన నివాళులు



**జగ్గంపేట, పెన్ పవర్, మే 7**: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 102వ వర్ధంతి సందర్భంగా జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కర్నాకుల రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు గిరిజన హక్కుల కోసం, దేశ స్వతంత్రం కోసం పోరాటం చేశాడని, భారత ప్రభుత్వం అల్లూరి త్యాగాన్ని గుర్తించకుండా కుల మతాల గొడవల్లో దాడులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. స్వతంత్రం కోసం అల్లూరి తెల్లదొరల మీద దాడి చేస్తే తెల్లదొరలు పోయిన తర్వాత భారతదేశాన్ని, ప్రజలను దోచుకోవడానికి నల్ల దొరలు వచ్చారని ఆయన తెలిపారు. అల్లూరి సీతారామరాజు పోరాట స్ఫూర్తితో దోపిడీ రాజ్యాన్ని కూల్చడం కోసం పోరాటం చేయవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు డాన్ శ్రీను గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థుల ఫలితాలు అభినందనీయం.

కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టెన్త్ టాపర్లకు ఘన సన్మానం.



**కిర్లంపూడి,ప్రత్తిపాడు, పెన్ పవర్, మే 7:** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం అభినందినీయమని,ప్రత్తిపాడు నియోజకవర్గం ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ శ్రీనివాసరావు అన్నారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల టెన్త్ విద్యార్థులు ఈ ఏడాది అద్భుత ఫలితాలు సాధించి ప్రభుత్వ విద్య ప్రతిష్టను పెంచడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టెన్త్ టాపర్లకు గురువారం ఘన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 9 హైస్కూళ్లకు చెందిన 18 మంది టెన్త్ టాపర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక,ఉపాధ్యాయుల ప్రత్యేక శ్రద్ధ,సెలవు దినాల్లోనూ నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతుల ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. టెన్త్ ఫలితాలు ప్రతి విద్యార్థి జీవితంలో కీలక మలుపు అని పేర్కొన్నారు. చదువును మధ్యలోనే ఆపకుండా ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని ప్రోత్సహించారు. దివంగత వ్యాయామ ఉపాధ్యాయుడు కోడి వెంకట్రావు జ్ఞాపకార్థంగా ఆయన తనయుడు కోడి శ్రీనివాసరావు సొంత నిధులతో టాపర్లను సన్మానించడం అభినందియనీయమని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సూరిబాబు,ఎంఈఓలు వి.రాజుబాబు, వై.అచ్చిరాజు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొమ్ముల కన్నబాబు,వెలుగుల నాని,దాసం శేషారావు,గొంతిన సురేష్,యూటీఎఫ్ నాయకులు కె.శ్రీను,మిరియాల రాజబాబు,దొడ్డిపట్ల రాజబాబు, రామలింగేశ్వరరావు,ఎంవి రమణ,ఉపాధ్యాయులు ప్రసాద్ బాబు,సూర్యనారాయణ,సూర్యావతి తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రఘువీరాకు రాజ్యసభ...?

**అనంతపురం, మే 7, పెన్ పవర్:** ఏపీలో రాజ్యసభ ఎన్నికల సందడి ప్రారంభం అయింది. జూన్లో నలుగురు రాజ్యసభ సభ్యులు ఏపీ నుంచి పదవీ విరమణ చేయనున్నారు. అయితే ఆ నాలుగు పదవులు కూడా కూటమికి దక్కనున్నాయి. ఎందుకంటే ఏపీలో కూటమి ఏకపక్షంగా బలంగా ఉంది. అందుకే ఆ నాలుగు పదవులు కూటమి ఖాతాలో పడనున్నాయి. అయితే అనూహ్యంగా ఏపీకి చెందిన ఓ కాంగ్రెస్ నేతకు రాజ్యసభ పదవి దక్కనున్నట్లు పొలిటికల్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన ఆ నేత ప్రస్తుతం.. ఏఐసీసీలో చోటు దక్కించుకున్నారు. ఆయనకు రాజ్యసభ పదవి దక్కడం ఖాయమన్న టాక్ నడుస్తోంది. అయితే అది ఏపీ నుంచి కాదు. కర్ణాటక నుంచి ఆయన నామినేట్ కానున్నట్లు తెలుస్తోంది. ఆయనే నీలకంఠాపురం రఘువీరారెడ్డి. కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీ మంత్రిగా వ్యవహరించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ప్రస్తుతం ఏఐసీసీ మెంబర్ గా ఉన్న ఆయనకు ఈసారి రాజ్యసభ ఛాన్స్ తప్పదు అన్న టాక్ నడుస్తోంది.ఉమ్మడి అనంతపురం జిల్లా మడకశిర నియోజకవర్గం నుంచి తన రాజకీయ ప్రస్తానాన్ని ప్రారంభించారు రఘువీరారెడ్డి. 1985లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్న ఆయన స్వల్పకాలంలోనే ఎమ్మెల్యే అయ్యారు. 1989లో తొలిసారిగా మడకశిర నియోజకవర్గం నుంచి గెలిచారు. కోట్ల విజయభాస్కర్ రెడ్డి మంత్రివర్గంలో పశు సంవర్ధక శాఖ మంత్రిగా పదవి చేపట్టారు. 1994 ఎన్నికల్లో మాత్రం ఓడిపోయారు. 1999లో రెండోసారి గెలిచారు. 2004లో గెలిచి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి అయ్యారు. 2009లో సైతం కళ్యాణదుర్గం నుంచి పోటీ చేసి గెలిచారు రఘువీరారెడ్డి. మూడోసారి మంత్రి పదవి చేపట్టారు. రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి క్యాబినెట్లలో కొనసాగుతూ వచ్చారు. రాష్ట్ర విభజనతో చాలామంది కాంగ్రెస్ పార్టీ నేతలు ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇతర పార్టీల్లో చేరిపోయారు. రఘువీరారెడ్డి మాత్రం ఆ పని చేయలేదు. పైగా ఏపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం ఏఐసీసీ మెంబర్గా కొనసాగుతున్నారు.అనంతపురం జిల్లా బెంగళూరుకు దగ్గరగా ఉంటుంది. కర్ణాటక రాజకీయాల్లో అక్కడ నేతలు యాక్టివ్ గా ఉంటారు. ప్రస్తుతం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కర్ణాటకలో కాంగ్రెస్ ఇన్చార్జిగా కూడా కొన్ని నియోజకవర్గాలకు వ్యవహరించారు రఘువీరారెడ్డి. బెంగళూరు చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో పర్యటనలు చేసి ఎన్నికల ప్రచారం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. అందుకే ఇప్పుడు కర్ణాటక నుంచి రాజ్యసభకు రఘువీరారెడ్డిని ప్రమోట్ చేస్తారని తెలుస్తోంది. ఆ రాష్ట్రం నుంచి నాలుగు రాజ్యసభ పదవులు ఖాళీ అవుతున్నాయి. అందులో మూడు పదవులు కాంగ్రెస్ కూటమికి దక్కడం ఖాయం. అందుకే రఘువీరా పేరును కర్ణాటక కాంగ్రెస్ పరిగణలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## గుంటూరు చుట్టూ ఆరు కారిడార్లు

**గుంటూరు, మే 7, పెన్ పవర్:** గుంటూరు నగర రూపురేఖలను సమూలంగా మార్చేందుకు నగరపాలక సంస్థ భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. రాజధాని ప్రాంతంలో కీలకమైన నగరంగా ఉన్న గుంటూరును మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దేందుకు ఆరు ప్రధాన మార్గాలను 'మోడల్ కారిడార్లు'గా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. సుమారు రూ. 210 కోట్ల అంచనా వ్యయంతో 39.3 కిలోమీటర్ల మేర ఈ రహదారులను ఆధునిక హంగులతో తీర్చిదిద్దనున్నారు.

**అభివృద్ధి చేయనున్న ఆరు కారిడార్లు..**

చుట్టుగుంట సెంటర్ – గోరంట్ల రోడ్డు: 8 కి.మీ పొడవునా అమరావతి రోడ్డు వరకు విస్తరణ.
మద్రాసు గుంటూరు రోడ్డు: దండిమార్చి విగ్రహం నుండి అంకిరెడ్డిపాలెం వరకు 8 కి.మీ మేర అభివృద్ధి.
ఇన్నర్ రింగ్ రోడ్డు: మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు నుండి జాతీయ రహదారి అనుసంధానం వరకు 12 కి.మీ.
పొన్నూరు రోడ్డు: బీఆర్ స్టేడియం నుండి బైపాస్ వరకు 4.5 కి.మీ.
గుంటూరు -- హనుమాన్ పాలెం రోడ్డు: చాకలి చెరువు నుండి బైపాస్ వరకు 3.8 కి.మీ.
గుంటూరు వీఐపీ రోడ్డు: వెస్ట్ పోలీస్ స్టేషన్ నుండి బైపాస్ వరకు 3 కి.మీ మేర ఆధునికీకరణ.

ప్రత్యేకంగా వెండింగ్ జోన్లు..

ఈ ప్రాజెక్టులో భాగంగా కేవలం రోడ్ల విస్తరణే కాకుండా.. పాదచారుల కోసం ప్రత్యేక నడక మార్గాలు, సైకిల్ ట్రాకులు, కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు స్మార్ట్ బస్ స్టాప్‌లు, ఆధునిక మరుగుదొడ్లు, డివైడర్ల మధ్య పచ్చదనం, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఆధునిక బోలార్డ్స్‌ను ఏర్పాటు చేస్తారు. చిరువ్యాపారుల కోసం ప్రత్యేకంగా వెండింగ్ జోన్లను కూడా క్రమబద్ధీకరించనున్నారు. ఈ కారిడార్ల ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గడమే కాకుండా, నగర జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని కమిషనర్ మయూర్ అశోక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## యువతుల ఫోటోలతో నకిలీ ప్రొఫైల్స్

**గుంటూరు, మే 7 పెన్ పవర్:** సైబర్ నేరగాళ్ల మాయలో సామాన్యులే కాదు, చదువుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సైతం పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లలో అందమైన యువతుల ఫోటోలతో నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి, పెళ్లి పేరుతో నమ్మించి నిలువునా ముంచేస్తున్న ముఠాలు గుంటూరులో పంజా విసిరాయి. కేవలం నెల రోజుల వ్యవధిలో ఇద్దరు ఐటీ ఉద్యోగులు ఈ కేటుగాళ్ల చేతిలో చిక్కి సుమారు 11 లక్షల రూపాయలు కోల్పోయారు.నేరగాళ్లు ముందుగా మ్యాట్రిమోనీ సైట్లలో పరిచయమై, ఆ తర్వాత వాట్సాప్ కాల్స్ ద్వారా బాధితులతో సన్నిహితంగా మాట్లాడుతున్నారు. తాము కూడా ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నామని, ఆస్తులు ఉన్నాయని నమ్మబలుకుతున్నారు. నమ్మకం కుదిరిన తర్వాత, "మన భవిష్యత్తు కోసం ఈ వెబ్‌సైట్‌లో ఇన్వెస్ట్ చేద్దాం.. మంచి లాభాలు వస్తాయి" అని ఆశ చూపుతున్నారు. వారి మాటలు నమ్మిన బాధితులు వారు పంపిన లింకుల్లో డబ్బులు డిపాజిట్ చేస్తున్నారు.పాతగుంటూరుకు చెందిన ఒక ఇంజనీర్ సుమారు రూ. 7 లక్షలు, అరండల్‌పేటకు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రూ. 4 లక్షలు ఈ విధంగా పోగొట్టుకున్నారు. బాధితులు డబ్బులు జమ చేసిన కొద్దిరోజులకే సదరు యువతుల ఫోన్ నంబర్లు స్విచ్ఛాఫ్ అవ్వడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. ఈ సొమ్ము విదేశీ ఖాతాల్లోకి వెళ్లడం వల్ల రికవరీ చేయడం సవాలుగా మారిందని పోలీసులు చెబుతున్నారు. అపరిచిత వ్యక్తుల పెట్టుబడి సలహాలను నమ్మి మోసపోవద్దని సైబర్ క్రైమ్ విభాగం హెచ్చరిస్తోంది.

## ఇక ప్రజల్లోనే లోకేష్

**గుంటూరు, మే 7, పెన్ పవర్:** యువ నాయకుడు లోకేష్ ప్రభావం ఇప్పుడు ఏపీలో కనిపిస్తోంది. జాతీయస్థాయిలో కూడా ఆయన పేరు వినిపిస్తోంది. మొన్ననే ఆయన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కూడా అయ్యారు. పేరుకే టిడిపి జాతీయ అధ్యక్షుడిగా చంద్రబాబు ఉన్నారు. కానీ ఆయనకు మించి అన్నట్టు లోకేష్ వ్యవహారం నడుస్తోంది. ఆయన కనుసన్నల్లోనే పార్టీ ఉంది. పార్టీ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం పార్టీపై పూర్తి పట్టు సాధించారు లోకేష్. ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల్లో మాస్ లీడర్ గా ఎదగాలని గట్టి ప్రయత్నం లో ఉన్నారట నారా లోకేష్. పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు యువగళం పాదయాత్ర చేపట్టారు. తనను తాను ప్రూవ్ చేసుకున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు దోహదపడ్డారు. ఇప్పుడు మంత్రిగా ఉండడంతో పాటు పార్టీ బాధ్యతలు తీసుకున్న దృష్ట్యా.. మరింత ప్రభావంతమైన నేతగా మారాలన్న ఆలోచనలో లోకేష్ ఉన్నట్లు తెలుస్తోంది.లోకేష్ పొలిటికల్ ఎంట్రీ సమయంలో ఆయన ఒక సాధారణ వ్యక్తి. చంద్రబాబు తనయుడు మాత్రమే. రాజకీయ వారసుడు అనిపించుకోలేకపోయారు. చాలా ఇబ్బందులు పడ్డారు కూడా. పైగా చంద్రబాబు లోకేష్ ను ఎమ్మెల్సీ చేసి ఆపై మంత్రివర్గంలోకి తీసుకున్నారు. ప్రత్యక్ష ఎన్నికల ద్వారా కాకుండా పరోక్షంగా ఆయనకు పదోన్నతి కల్పించారు. లోకేష్ కెరీర్ కు అది కూడా ఒక రకమైన ఇబ్బందికరమే. చంద్రబాబు రాజకీయ ప్రత్యర్థులంతా లోకేష్ ను వ్యతిరేకించడం ప్రారంభించారు. ఆయన వ్యక్తిత్వాన్ని కూడా హననం చేశారు. నిత్యం వ్యక్తిగతంగా టార్గెట్ చేశారు. అయితే అన్నింటిని మించి అన్నట్టు రాటు తేలారు నారా లోకేష్. రాజకీయంగా పూర్తిగా పట్టు సాధించారు. వ్యక్తిగతంగా తన శరీర ఆకృతిని మార్చుకున్నారు. పరిపూర్ణమైన నాయకుడిగా ఎదిగారు. అయితే ఇది చాలదు అనేది టిడిపిలో ఉన్న ఒక భావన.రాజకీయాల్లో మాస్ లీడర్ గా ఎదిగితేనే నాలుగు కాలాలపాటు గుర్తిస్తారు. అయితే చంద్రబాబు పాలనా థక్షుడు. ఆయన మాస్ లీడర్ కాదు. ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్న చంద్రబాబు ఇప్పుడు చివరి దశలో మాత్రం చాలా గౌరవాన్ని దక్కించుకున్నారు. అయితే చంద్రబాబు మాదిరిగా కాకుండా లోకేష్ ఒక మాస్ లీడర్ గా ఎదగాలి అంటే ప్రజలతో మమేకమై పని చేయాల్సి ఉంటుంది. 2029 ఎన్నికలను టార్గెట్ చేసుకొని ఇప్పుడు లోకేష్ ప్రజల మధ్యకు వచ్చేందుకు పక్కాగా ప్రణాళిక రూపొందించుకున్నట్లు తెలుస్తోంది. తరచూ జిల్లాల్లో పర్యటిస్తూ పార్టీని అభివృద్ధి చేయడమే కాదు ప్రజల్లో తన ఇమేజ్ను పెంచుకునే ప్రయత్నంలో ఉన్నారట. త్వరలో రాష్ట్ర వ్యాప్త పర్యటనలకు శ్రీకారం చుడతారట. చూడాలి మరి అందులో ఎంతవరకు సక్సెస్ అవుతారో..

## పవన్ తప్పటడుగులు వేశారా... సోషల్ మీడియాలో ప్రశ్నలు

**కాకినాడ, మే 7, పెన్ పవర్:** జనసేన అధినేత పవన్ కల్యాణ్ వేసిన రాజకీయ అడుగు ఆయనను ముఖ్యమంత్రిని కానివ్వకుండా చేశాయి. ఆయనసరైన సమయంలో ఎంట్రీ ఇవ్వకపోవడంతో పాటు, పార్టీ పెట్టిన వెంటనే ఇతర పార్టీలకు మద్దతు ప్రకటించడం కూడా ఆయన ముఖ్యమంత్రి కాకపోవడానికి కారణాలయ్యాయి. 2014లో పార్టీ పెట్టి పోటీ చేయకుండా బీజేపీ, టీడీపీకి బేషరతుగా మద్దతు ఇవ్వడంతోనే ఆయన రాజకీయ ప్రయాణం డిప్యూటీ సీఎం వరకే నిలిచిపోయిందంటున్నారు. పవన్ కల్యాణ్ తమిళనాడు ఎన్నికలను చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉంది. ధైర్యాన్ని ప్రదర్శించలేకపోవడం, రాజకీయ శూన్యత ఉందా? లేదా? అన్నది చూసుకోకుండా పార్టీ పెట్టడం కూడా పవన్ ను సీఎం కుర్చీకి దూరం చేసింది.టీవీకే చీఫ్ విజయ్ పార్టీ పెట్టిన రెండేళ్లకే అధికారంలోకి వచ్చిన తర్వాత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన తీరుపై ఆంధ్రప్రదేశ్ లోనూ చర్చ జరుగుతుంది. పవన్ కల్యాణ్ విజయ్ లాగే చరిష్మా ఉన్న వ్యక్తి. లక్షలాది మంది అభిమానులు పవన్ సొంతం. ఇక కాపు సామాజికవర్గం మొత్తం ఆయన వెనక ఉంది. అదే ఆయనకు ప్లస్ పాయింట్ అయ్యేది. 2024 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి ఉంటే ఖచ్చితంగా సీఎం పదవి సులువుగా దక్కేదన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. కానీ పవన్ కల్యాణ్ అది చేయకుండా పొత్తులతో సరిపెట్టుకుని, జగన్ ను ఓడించడమే ధ్యేయంగా పెట్టుకోవడం ఆయన డిప్యూటీ సీఎం వరకే ఆగిపోవాల్సి వచ్చింది.ఏదైనా పార్టీ పెట్టిన తొలి నాళ్లలో ఉన్న క్రేజ్, ఇమేజ్ రాను రాను తగ్గుతుంది. అది పవన్ కైనా, విజయ్ కైనా ఒకటే ఫార్ములా. రాజకీయ పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ తొలుత బీజేపీని తిట్టిపోశారు. తర్వాత అదే పార్టీతో చేతులు

# మారిపోతున్న ఎన(ర్న) లిస్టులు

**విజయవాడ, మే 7, పెన్ పవర్:**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో సంక్లిష్ట పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఎన్నడూ లేని ఓ వాతావరణం ఇప్పుడు ప్రధానంగా కనిపిస్తుండడం చర్చకు దారితీస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా టీవీ డిబేట్లతోపాటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండేవారు ఇప్పుడు అదే పార్టీకి వ్యతిరేకంగా మారుతున్నారు. ఆ పార్టీ అగ్రనేతలపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. అయితే వారిని దూరం పెట్టడం వల్ల అలా చెబుతున్నారా? లేకుంటే ఆశించిన స్థాయిలో వారికి చెల్లింపులు చేయడం లేదా? అందుకే వారు ఎదురు తిరిగారా? అనేది తెలియడం లేదు. ప్రధానంగా పాషా, కె ఎస్ ప్రసాద్ ఇప్పుడు వరుసగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు వ్యతిరేకంగా ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఇక సాక్షి ఛానల్ లో జరిగే డిబేట్ కు హాజరు కాబోమని తేల్చి చెబుతున్నారు. అయితే ఇంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వీరిని పెంచి పోషించిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు ఈ ఇద్దరు ఆ పార్టీ అగ్ర నేతలను వ్యతిరేకిస్తుండడం చూస్తుంటే తెర వెనుక ఏదో జరిగిందన్న అనుమానం వ్యక్తం అవుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాతో పాటు డిజిటల్ మీడియాలో పనిచేసే వారికి ఆశించిన స్థాయిలో చెల్లింపులు జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. పార్టీలో ఇటువంటి వాటిని సజ్జల రామకృష్ణారెడ్డి హ్యాండిల్ చేసేవారు. అయితే ఇప్పుడు చెల్లింపులు నిలిపివేయడంతో ఆయన టార్గెట్ అవుతున్నట్లు పొలిటికల్ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. సాక్షి ఛానల్ డిబేట్ లు అంటే ముందుగా పాషా, కె ఎస్ ప్రసాద్ గుర్తుకు వస్తారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా డిబేట్లు ఇచ్చే వీరు అవసరం అనుకుంటే వ్యక్తిగత దాడికి దిగుతారు కూడా. అంతలా ఉంటుంది వీరి జోరు. అయితే క్రమేపి ఇటీవల వారి నోరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలపై పడుతోంది. తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు. ప్రధానంగా సాక్షిలో కనిపించే వీరు ఇకనుంచి ఆ ఛానల్ వైపు వెళ్ళమని చెబుతుండడం కూడా విశేషం.మొన్న మధ్యన జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తెచ్చిన సంగతి తెలిసిందే. మచిలీపట్నం-విజయవాడ= గుంటూరును కలుపుతూ మావిగన్ అని పేరు పెట్టాలని సూచించారు జగన్మోహన్ రెడ్డి. సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్స్ కు గురయ్యారు. ఆ సమయంలో విశ్లేషకుడి రూపంలో కేఎస్ ప్రసాద్ జగన్మోహన్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే ఆ తర్వాత సాక్షి ఛానల్ డిబేట్లో పాల్గొని భిన్నంగా స్పందించారు. దీంతో అందరూ పేటీఎం డబ్బులు దక్కకపోవడంతోనే కేఎస్ ప్రసాద్ అలా మాట్లాడారని.. సోషల్ మీడియా వేదికగా కామెంట్లు పెట్టారు. అదే సమయంలో పాషా సైతం జగన్ మావిగన్ ప్రతిపాదనను గట్టిగానే తిప్పి కొట్టారు. అయితే ఇప్పుడు ఏకంగా ఇద్దరూ ఒకరికొకరు ఇంటర్వ్యూలు ఇస్తూ.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలపై విరుచుకుపడుతున్నారు.
జగన్మోహన్ రెడ్డి చుట్టూ వలయంగా ఏర్పడి పార్టీని పాతాళంలోకి నెట్టేస్తున్నారంటూ ఆరోపణలు చేస్తున్నారు.ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డి తీరుపై ఆ ఇద్దరూ ఇప్పుడు బాహటంగానే ఆరోపణలు చేస్తున్నారు. కోవర్టు అంటూ కొత్త ముద్ర వేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డికి ఎలివేషన్లు ఇచ్చి.. పక్కదారి పట్టించి.. పార్టీని పూర్తిగా భ్రష్టు పట్టించారన్న ఆరోపణలతో రెచ్చిపోతున్నారు. అయితే వీరికి చెల్లింపులు నిలిచిపోయాయని.. అందుకే అలా మాట్లాడుతున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే సాక్షి ఛానల్ కు వెళుంటే.. తమను పెయిడ్ ఆర్టిస్టుల మాదిరిగా చూస్తున్నారని.. అందుకే అటువైపు వెళ్ళమని చెబుతున్నారు. మొత్తానికి ఇద్దరు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకులుగా మారిపోవడం చూస్తుంటే మాత్రం ఆ పార్టీలో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోంది.

# రైల్వే జోన్ రాజకీయం...

**విశాఖపట్టణం, మే 7, పెన్ పవర్:**
ఎట్టకేలకు విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం గెజిట్ ఇచ్చింది. జూన్ ఫస్ట్ నుంచి విశాఖ కేంద్రంగా యాక్టివిటీ స్టార్ట్ కానుంది. అయితే రైల్వే జోన్ చుట్టూ ఇప్పుడు రాజకీయ రచ్చ నడుస్తోంది. కేకే లైన్ లేకుండా జోన్ ఎందుకు అంటూ పోరాటానికి సై అంటోంది వైసీపీ. ఇటు ప్రజా పోరాటాల వల్లే జోన్ వచ్చిందని వామపక్ష పార్టీలు చెప్పుకుంటుంటే..చంద్రబాబు కృషి వల్లే కేంద్రం జోన్ ఏర్పాటునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది టీడీపీ నేతలు చెబుతున్నారు. దీంతో ఉత్తరాంధ్ర వేదికగా రైల్వే జోన్ సెంట్రిక్‌గా పొలిటికల్ ఫైట్ ఇంట్రెస్టింగ్‌గా మారింది.ఏపీ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ జూన్ ఫస్ట్ నుంచి స్టార్ట్ కానుంది. ఇప్పుడున్న గుంతకల్లు, గుంటూరు, విజయవాడ డివిజన్లతో పాటు విశాఖ డివిజన్‌ను కలిపి కొత్త రైల్వే జోన్ పని చేయనుంది. దక్షిణ కోస్తా జోన్ పేరుతో ఏర్పాటైన ఈ రైల్వే జోన్ కోసం ఉత్తరాంధ్ర ప్రజలు రాజకీయాలకు అతీతంగా సుదీర్ఘ పోరాటం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ప్రత్యేక రైల్వే జోన్ లేకుండానే ఇన్నాళ్లూ ఏపీలో రైల్వే యాక్టివిటీ నడిచింది.ఆంధ్రప్రదేశ్ వార్తలుప్రధాని నరేంద్ర మోదీ 2019 ఎన్నికల ప్రచారంలో విశాఖపట్నం వచ్చినపుడు రైల్వే జోన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రధాని హామీ అమలు కావడానికి ఏడేళ్ల సమయం పట్టింది. విశాఖపట్నం కేంద్రంగా రైల్వే జోన్ ప్రకటించిన తర్వాత ప్రధాన కార్యాలయం నిర్మాణానికి అప్పట్లో కేంద్ర ప్రభుత్వం రూ.150 కోట్ల వరకు మంజూరు చేసింది. అయితే అవసరమైన భూముల కేటాయింపులో నాటి వైసీపీ ప్రభుత్వం జాప్యం చేసిందని టీడీపీ ఆరోపిస్తోంది. ఒక విధంగా రైల్వే జోన్ పనులను ముందుకు వెళ్లకుండా వైసీపీ అడ్డుకుందనే వాదన వినిపిస్తోంది.అయితే విశాఖ రైల్వే జోన్ క్రెడిట్ సీఎం చంద్రబాబు, కేంద్ర ప్రభుత్వానిదే అంటూ టీడీపీ నేతలు ప్రచారం చేసుకుంటుండగా..వైసీపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కొత్తవలస–కిరండూల్ లైన్ లేకుండా విశాఖ రైల్వేజోన్ ప్రకటించి తీవ్ర అన్యాయం చేశారని అంటోంది వైసీపీ. కేకే లైన్ లేకుండా విశాఖ రైల్వే జోన్ ఇచ్చి లాభమేంటి అంటూ ప్రశ్నిస్తోంది.




కేకే లైన్‌ను మినహాయించి రైల్వే జోన్ ఇవ్వడమంటే..చనిపోయిన బిడ్డను చేతిలో పెట్టినట్టుగా ఉందని విమర్శిస్తోంది. సీఎం చంద్రబాబు అసమర్థత వల్లే కేకే లైన్, అరకు కోరాపుట్ లేని రైల్వేజోన్ విశాఖకు దక్కిందని మండిపడుతోంది వైసీపీ. ఈ తరహా విశాఖ రైల్వేజోన్ రాష్ట్రానికి భారమే తప్ప మరొకటి కాదంటున్నారు ప్రతిపక్ష నేతలు.కేకే లైన్‌తో కూడిన విశాఖ రైల్వేజోన్ ఏర్పాటు చేయాలన్నదే తమ ప్రధాన డిమాండ్ అంటోంది వైసీపీ. కేకే లైన్, అరకు, కోరాపుట్ వంటి టూరిజం ప్రాంతాలు లేకుండా కేంద్రం ప్రకటించిన రైల్వేజోన్ ఏపీకి గుదిబండగా మారుతుందనే వాదన వినిపిస్తున్నారు. 446 కిలోమీటర్ల పొడవున్న ఉన్న కేకే లైన్ ఐరన్ ఓర్, మాంగనీస్, బాక్సైట్ ట్రాన్స్‌పోర్ట్‌కు ప్రధాన మార్గమే కాదు..విశాఖ రైల్వే జోన్‌కు అతిపెద్ద ఆదాయ వనరు అన్న విషయాన్ని మర్చిపోతుయారని ఫైర్ అవుతున్నారు వైసీపీ లీడర్లు. ఇక ప్రజా పోరాటాల ఫలితమే రైల్వే జోన్ అంటున్న వామపక్షాలు..కేకే లైన్ విషయంలో వైసీపీ డిమాండ్‌నే వినిపిస్తున్నాయి.ప్రతిపక్ష వైసీపీ వాదనపై..టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. విశాఖపట్నం రైల్వేజోన్ విషయంలో వైసీపీ క్రెడిట్ చోరీకి పాల్పడుతోందని...రాజకీయ లబ్ధి కోసమే జగన్ అండ్ కో లేనిపోని విమర్శలు చేస్తున్నారని రివర్స్ అటాక్ చేస్తున్నారు తెలుగు తమ్ముళ్లు. 2019 నుంచి ఐదేళ్ల పాటు వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ప్రత్యేక రైల్వే జోన్‌ను సాధించలేకపోయారో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వల్లే రైల్వేజోన్ వచ్చిందన్న విషయం అందరికీ తెలుసు అంటున్న తెలుగు తమ్ముళ్లు..విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ కావాలన్న ఉత్తరాంధ్ర ప్రజల కల ఫలించిందని చెప్తున్నారు.తెలుగు వార్తలుకేంద్రంలో ఎన్డీయే భాగస్వామిగా ఉంది టీడీపీ. పైగా రాష్ట్రంలో కూటమి సర్కార్ ఉంది. ఈ ఈక్వేషన్స్ నేపథ్యంలోనే రైల్వే జోన్ సాధ్యమైందన్నది కూటమి నేతల వాదన. కేంద్రం అలా రైల్వే జోన్‌పై గెజిట్ రిలీజ్ చేసిందో లేదో..ఇలా పొలిటికల్ ఫైట్ స్టార్ట్ అయింది. విశాఖ కేంద్రం ఉత్తరాంధ్ర లీడర్లు..ఎవరి వాదన వాళ్లు వినిపిస్తున్నారు. ప్రజల చిరకాట కోరిక నెరవేరింది సరే కానీ..రైల్వే జోన్ చుట్టూ కొనసాగుతున్న రాజకీయ యుద్ధం ఎటు దారితీస్తుందో చూడాలి.

# పాట్ కమిన్స్‌కు రూ.113 కోట్ల భారీ ఆఫర్.. ఐపీఎల్ ఫ్రాంచైజీలకు క్రికెట్ ఆస్ట్రేలియా చెక్!

- ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్‌కు భారీ ఆఫర్
- దేశం తరఫున ఆడేందుకు సుమారు రూ.113 కోట్ల కాంట్రాక్ట్
- ఫ్రాంచైజీ లీగ్స్ ఆఫర్ల నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా నిర్ణయం
- ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ కెప్టెన్‌గా జట్టుకు అగ్రస్థానం
- పంజాబ్‌పై విజయం అనంతరం జట్టు ప్రదర్శనపై కమిన్స్ ప్రశంసలు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా టెస్ట్, వన్డే కెప్టెన్ పాట్ కమిన్స్‌ను తమతోనే అట్టిపెట్టుకునేందుకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) కనీవినీ ఎరుగని రీతిలో భారీ కాంట్రాక్ట్‌ను ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా టెస్ట్ క్రికెట్‌కు ప్రాధాన్యతనిస్తూ, దేశం తరఫున ఆడేందుకు గాను కమిన్స్‌కు మూడేళ్ల కాలానికి 12 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 113 కోట్లు) దీర్ఘకాలిక ఒప్పందాన్ని ఆఫర్ చేసినట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ తన కథనంలో పేర్కొంది. దీని ప్రకారం కమిన్స్ ఏడాదికి 4 మిలియన్ డాలర్లు సంపాదించనున్నాడు. ప్రపంచవ్యాప్తంగా తమ ఫ్రాంచైజీ తరఫున టీ20 లీగ్స్‌లో ఆడేందుకు గాను, ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ సుమారు 10 మిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్ల (సుమారు రూ. 62.22కోట్లు) ఆఫర్ ఇచ్చిందన్న వార్తల నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కొత్త ఒప్పందం ప్రకారం కమిన్స్ ఆడే మ్యాచ్‌ల సంఖ్యతో సంబంధం లేకుండా ఈ భారీ మొత్తం అందుతుంది. ఈ విషయంపై క్రికెట్ ఆస్ట్రేలియా హెడ్ ఆఫ్ క్రికెట్ జేమ్స్ ఆల్సాప్ మాట్లాడుతూ.. "కమిన్స్ వంటి అగ్రశ్రేణి ఆటగాళ్లకు దీర్ఘకాలిక భద్రత కల్పించడం మా బాధ్యత. పాట్, జోష్ హేజిల్‌వుడ్ వంటి మల్టీ-ఫార్మాట్ ప్లేయర్లకు మార్కెట్‌లో విపరీతమైన డిమాండ్ ఉంది. వారిని ఆస్ట్రేలియా క్రికెట్‌కు కట్టుబడి ఉండేలా చూడటం మా ప్రధాన లక్ష్యం" అని వివరించారు.

అంతర్జాతీయ క్రికెట్‌లో కమిన్స్ భవిష్యత్తుపై ఇలాంటి చర్చ జరుగుతుండగానే, ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా అద్భుతంగా రాణిస్తున్నాడు. నిన్న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 33 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్‌లో అద్భుత బౌలింగ్‌తో రాణించిన కమిన్స్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్నాడు. విజయం అనంతరం కమిన్స్ మాట్లాడుతూ.. "మా ప్రదర్శన చాలా సమర్థవంతంగా ఉంది. బ్యాటర్లు అద్భుతమైన స్కోరు అందించారు. పంజాబ్ వంటి బలమైన జట్టుపై రెండోసారి బౌలింగ్ చేసి గెలవడం సులభం కాదు. కానీ మా బౌలర్లు చాలా చక్కగా రాణించారు" అని జట్టును ప్రశంసించాడు.

# ముంబై ఇండియన్స్‌కు డబుల్ షాక్.. కెప్టెన్, వైస్ కెప్టెన్ దూరం!

- పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో ఉన్న ముంబై ఇండియన్స్
- మిగిలిన నాలుగు మ్యాచ్‌లు గెలిస్తేనే ప్లే ఆఫ్స్ ఆశలు
- ఆర్సీబీతో కీలక మ్యాచ్‌కు ముందు జట్టులో కెప్టెన్సీ సంక్షోభం
- పాండ్యా, సూర్య అందుబాటులో లేకుంటే రోహిత్‌కు కెప్టెన్సీ?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో ప్లే ఆఫ్స్ ఆశలు నిలబెట్టుకోవడానికి తీవ్రంగా పోరాడుతున్న ముంబై ఇండియన్స్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పాయింట్ల పట్టికలో 9వ స్థానంలో నిలిచి కష్టాల్లో ఉన్న జట్టుకు ఇప్పుడు కెప్టెన్సీ సంక్షోభం పట్టుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరగనున్న కీలక మ్యాచ్ కోసం రాయ్‌పూర్‌కు వెళ్లిన జట్టు మొదటి బృందంలో కెప్టెన్ హార్దిక్ పాండ్యా, స్టాండ్-ఇన్ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. వెన్నునొప్పితో బాధపడుతున్న హార్దిక్ పాండ్యా, లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన గత మ్యాచ్‌కు దూరమయ్యాడు. ఇప్పుడు మే 10న ఆర్సీబీతో జరగనున్న చావో రేవో మ్యాచ్‌కు కూడా అతను అందుబాటులో ఉండటంపై సందేహాలు నెలకొన్నాయి. ముంబై నుంచి రాయ్‌పూర్‌కు వెళ్లిన తొలి బృందంలో హార్దిక్ లేడు. మరోవైపు, గత మ్యాచ్‌లో జట్టును నడిపించిన సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి బృందంలో ప్రయాణించలేదు.

ఈ పరిస్థితుల్లో ఒకవేళ హార్దిక్, సూర్యకుమార్ ఇద్దరూ అందుబాటులో లేకపోతే, ఆర్సీబీతో మ్యాచ్‌కు రోహిత్ శర్మ మళ్లీ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడా? అనే చర్చ మొదలైంది. రోహిత్ శర్మ ఇప్పటికే తొలి బృందంతో పాటు రాయ్‌పూర్‌కు చేరుకున్నాడు. అయితే, మ్యాచ్‌కు ఇంకా సమయం ఉండటం, ముంబై-రాయ్‌పూర్ మధ్య విమాన సర్వీసులు తక్కువగా ఉండటంతో ఆటగాళ్లు వేర్వేరు బృందాలుగా వెళ్తున్నారని జట్టు వర్గాలు చెబుతున్నాయి.

ఈ సీజన్‌లో ఇప్పటివరకు 10 మ్యాచ్‌లలో కేవలం 3 విజయాలు సాధించి, 6 పాయింట్లతో ఉన్న ముంబై.. ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే మిగిలిన నాలుగు మ్యాచ్‌లలోనూ తప్పక గెలవాలి. హార్దిక్ గాయంపై ఓపెనర్ ర్యాన్ రికెల్టన్ మాట్లాడుతూ "అతడికి వెన్నునొప్పి ఉందని ఈ మధ్యాహ్నమే నాకు తెలిసింది. గాయం తీవ్రతపై నాకు పూర్తి సమాచారం లేదు. కానీ, త్వరలోనే అతను మాతో కలుస్తాడని ఆశిస్తున్నాను" అని వివరించాడు.

# మార్ష్ విధ్వంసక సెంచరీ, పంత్ మెరుపులు.. ఆర్సీబీ ముందు భారీ లక్ష్యం

- లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్ల విధ్వంసం
- మిచెల్ మార్ష్ 56 బంతుల్లోనే 111 పరుగులతో అద్భుత సెంచరీ
- చివర్లో 10 బంతుల్లో 32 పరుగులతో మెరిసిన రిషభ్ పంత్
- వర్షం కారణంగా మ్యాచ్‌ను 19 ఓవర్లకు కుదింపు
- డీఎల్ఎస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం
- ఛేజింగ్ లో కోహ్లీ డకౌట్




**హైదరాబాద్ పెన్ పవర్:** కీలక మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్ జీ) బ్యాటర్లు విధ్వంసం సృష్టించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో (ఆర్సీబీ) జరుగుతున్న మ్యాచ్‌లో ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ (111) అద్భుత సెంచరీతో కదం తొక్కడంతో లక్నో జట్టు భారీ స్కోరు సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో లక్నో నిర్ణీత ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. లక్నోలోని ఏకానా స్టేడియంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీ నిర్ణయం బెడిసికొట్టింది. ఆది నుంచే దూకుడుగా ఆడిన మిచెల్ మార్ష్, ఆర్సీబీ బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 56 బంతుల్లో 9 ఫోర్లు, 9 సిక్సర్లతో 111 పరుగులు చేసి లక్నోకు భారీ స్కోరుకు బలమైన పునాది వేశాడు. మరోవైపు, ఓపెనర్ అర్షిన్ కులకర్ణి (17) నెమ్మదిగా ఆడాడు.

మార్ష్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన నికోలస్ పూరన్ (38) కూడా తనదైన శైలిలో రాణించాడు. ఇక చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ మెరుపు ఇన్నింగ్స్ తో చెలరేగాడు. కేవలం 10 బంతులు ఎదుర్కొన్న పంత్.. 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 32 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో లక్నో స్కోరు 200 పరుగులు దాటింది. ఆర్సీబీ బౌలర్లలో హేజిల్‌వుడ్, కృనాల్ పాండ్య, రసిఖ్ సలామ్ తలో వికెట్ పడగొట్టారు. డక్వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 19 ఓవర్లలో 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది.

**భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీకి డబుల్ షాక్.. డకౌటైన కోహ్లీ!**

భారీ లక్ష్య ఛేదనలో ఆర్సీబీ ఆదిలోనే కష్టాల్లో పడింది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో, డక్వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆర్సీబీ ముందు 213 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. ఈ ఛేదనలో బెంగళూరు 1.4 ఓవర్లలోనే కేవలం 10 పరుగులు చేసి రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఆర్సీబీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ జాకబ్ బెతెల్ (4) మహమ్మద్ షమీ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆ వెంటనే, ప్రిన్స్ యాదవ్ వేసిన రెండో ఓవర్లో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ (0) రెండు బంతులు మాత్రమే ఆడి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. కోహ్లీ డకౌట్‌గా వెనుదిరగడంతో ఆర్సీబీ శిబిరంలో నిరాశ ఆవరించింది. ప్రస్తుతం క్రీజులో దేవదత్ పడిక్కల్ (0), కెప్టెన్ రజత్ పటీదార్ (1) ఉన్నారు. భారీ లక్ష్యాన్ని ఛేదించాలంటే మిగిలిన బ్యాటర్లు అసాధారణ రీతిలో రాణించాల్సిన పరిస్థితి నెలకొంది.

# నట వారసురాలు సింగిలే అంటున్నా మింగిలే!


టెలివిజన్ స్టార్ నటి శ్వేతా తివారీ నట వారసురాలిగా బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన పాలక్ తివారీ ప్రస్తుతం తన సినిమాల కంటే వ్యక్తిగత విషయాలతోనే సోషల్ మీడియాలో ఎక్కువగా లైమ్‌లైట్‌లో ఉంటోంది. తన అందచందాలతో కుర్రకారును ఆకట్టుకుంటున్న ఈ బ్యూటీ తాజాగా తన రిలేషన్‌షిప్ స్టేటస్‌పై స్పందించి అందరినీ ఆశ్చర్యపరిచింది. సింగిల్‌గా ఉన్నానని పాలక్ చెబుతున్నా.. బయట జరుగుతున్న ప్రచారం మాత్రం అందుకు భిన్నంగా ఉండటంతో నెటిజన్లు ఆసక్తికర చర్చ మొదలుపెట్టారు.

ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పాలక్ తివారీ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా తాను ప్రస్తుతం -సింగిల్-గానే ఉన్నానని స్పష్టంగా వెల్లడించారు. అయితే సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్‌తో పాలక్ ప్రేమలో ఉన్నట్లు గత కొంతకాలంగా బాలీవుడ్ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వస్తున్నాయి. పలుమార్లు వీరిద్దరూ జంటగా కెమెరా కంటికి చిక్కినా పాలక్ మాత్రం తనకు ఎవరితోనూ మొహబ్బత్ లేదని చెప్పడం గమనార్హం.



**సప్తమి గౌడ సాంప్రదాయ లుక్‌లో అద్భుతంగా, దేశవ్యాప్తంగా హృదయాలను గెలుచుకుంది**

పాలక్ చేసిన ఈ -సింగిల్- కామెంట్ సోషల్ మీడియా సెలబ్రిటీ ఓరీని కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. ఆమె ఇంటర్వ్యూ క్లిప్‌పై ఓరీ స్పందిస్తూ..-ఆమె సింగిలా???- అంటూ పెట్టిన కామెంట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. గతంలో పాలక్, ఓరీల మధ్య జరిగిన వాట్సాప్ చాట్స్ లీక్ అయ్యి పెద్ద దుమారమే రేపాయి. ముఖ్యంగా సారా అలీ ఖాన్ ప్రస్తావన ఉన్న ఆ చాట్స్



కారణంగా వీరి మధ్య కొంత విభేదాలు ఉన్నాయని ప్రచారం జరిగింది. ఇప్పుడు మళ్ళీ ఓరీ స్పందించడం పబ్లిసిటీ స్టంట్ అని కొందరు భావిస్తున్నారు.

ఇటీవల పాలక్ రణవీర్ అల్లాబాడియాతో ముచ్చటించారు. తన టీనేజ్ రోజుల్లో మాజీ ప్రియుడితో జరిగిన చిన్న చిన్న గొడవలు, బస్సు మిస్సయిన సందర్భాల గురించి పాలక్ సరదాగా చెప్పుకొచ్చారు. తన వృత్తిపరమైన సినిమా విశేషాల కంటే... రిలేషన్‌షిప్ స్టేటస్ .. ఓరీ చేసిన రియాక్షన్‌పైనే సోషల్ మీడియాలో ఎక్కువగా చర్చ సాగుతోంది.

మరోవైపు పాలక్ నటించిన తాజా చిత్రం -లుఖే- సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సిరీస్ లో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో పాలక్ నటించింది. తన తల్లి శ్వేతా తివారీ మాదిరిగానే నటనలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్న పాలక్ ఇలాంటి గాసిప్స్.. వైరల్ వార్తలతో ఎప్పుడూ వార్తల్లో నిలుస్తోంది. ఇబ్రహీం అలీ ఖాన్‌తో డేటింగ్ వార్తలకు పాలక్ సమాధానం నేను సింగిలే. కానీ భవిష్యత్తులో ఈ పటౌడీ వారసుడితో బంధం ఏ మలుపు తిరుగుతుందో చూడాలి.

పలక్ తివారీ ఒక ప్రముఖ టాలీవుడ్ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రంతో తెలుగులోకి అడుగుపెట్టబోతున్నట్లు గతంలో కథనాలొచ్చాయి. ముఖ్యంగా ఒక యువ స్టార్ హీరో సరసన ఆమెను కథానాయికగా ఎంపిక చేసేందుకు చర్చలు జరుగుతున్నట్లు ప్రచారమైనా ఆ తర్వాత దానికి సంబంధించిన అప్ డేట్ రాలేదు. రవీనా టాండన్ నటవారసురాలు రాషా తడానీ తర్వాత శ్వేతాతివారీ గారాల పుత్రిక టాలీవుడ్ లో డెబ్యూ ఇవ్వడానికి కొంత సమయం పట్టొచ్చు.

**శ్రద్ధా దాస్ చీర అందం సోషల్ మీడియా అభిమానులను కట్టిపడేసింది**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com